
క్లుప్తంగా

శివాలయాల్లో మాఘ మాస పూజలు



కాశీ విశ్వేశ్వర ఆలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం, నగరేశ్వరాలయం, ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయం, అప్పయ్య దేవాలయంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివాలయాల్లో అర్చనలు, అభిషేకాలు, హారతి తదితర పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భోగేశ్వరాలయంలో..



అలకంరణలో భోగేశ్వరుడు

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్ భోగేశ్వరుడు హారతి వెలుగులో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భోగేశ్వరునికి ప్రత్యేక అభిషేకం చేపట్టారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ఘనంగా పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో పెద్దమ్మ అమ్మవారు

గార్లదిన్నె: మండలంలోని బూదేడులో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేసి వేద పండితులు ప్రాణ ప్రతిష్టాపన చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



కల్లూరులో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గార్లదిన్నె: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ మహమ్మద్ గౌస్ సూచించారు. ఆదివారం మండలంలోని కల్లూరులో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే పరిమితికి మించి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకోరాదన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ అతివేగంగా డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు. గ్రామాల్లో ఎవరైనా అపరిచిత వ్యక్తులు సంచరిస్తుంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఎస్ఐ సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఆదివారం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు సుమారు 700 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లాలు, దను, దర్శన్, విజయ్, జిలాన్, కుమార్, షాషావలి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అశ్వత్థం తిరునాల



పెన్నానదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు



అలంకరణలో శింగరబట్టు,గణపతి,నారాయణ స్వామి



పూజలందుకుంటున్న ఉత్సవమూర్తులు



తిరునాళ్లలో భక్తుల సందడి

- పోటెత్తిన భక్తులు
- పెన్నానదిలో పుణ్య స్నానాలు

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన అశ్వత్థ నారాయణస్వామి మొదటి ఆదివారం తిరుణాల సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులు ఉత్తర, దక్షిణ ముఖంగా ప్రవహిస్తున్న పవిత్ర పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి నారాయణ స్వామి,చక్రభీమలింగేశ్వరుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కోర్కెలు నెరవేరిన భక్తులు కానుకలు, ముడుపులు, బియ్యం, బేడలు, తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరుణాల సందర్భంగా క్షేత్రంలో చెరుకు గడల అమ్మకాలతో పాటు నోరూరించే తినుబండారాలు, గాజుల అంగళ్లు, ఆట వస్తువుల దుకాణాలు వెలిశాయి. భక్తులు ఇబ్బంది పడకుండా పెద్ద వడుగూరు సీఐ రోషన్, పెద్దపప్పూరు ఎస్ఐ శరత్ పటిష్ట చర్యలు చేపట్టారు. నదిలోతట్టు ప్రాంతాల్లోకి వికలాంగులు, వృద్ధులు, చిన్నారులు వెళ్లకుండా ఆలయ పాలక మండలి చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాస రెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం తగు చర్యలు చేపట్టారు. గత మూడేళ్లలో తొలి ఆదివారం తిరుణాలకు ఊహించని రీతిలో భక్తులు తరలిరావడం ఇదే ప్రథమని దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. భక్తుల కోసం వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపారు. చిన్నపప్పూరు బస్టాండ్ వద్ద తాడిపత్రి పట్టణానికి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం సభ్యులు చలివేంద్రం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చేసిన భక్తులకు మొక్కుబడిలో భాగంగా పలు ప్రదేశాల్లో దాతలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చందన, రాయలచెరువు గ్రామ టీడీపీ శ్రేణులు

యాడికి: మండలంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. తెలుగుదేశంలో ఎంత కష్టపడినా గుర్తింపులేదని రాయలచెరువు, చందన గ్రామాలకు చెందిన 35 కుటంబాలు ఆదివారం పార్టీని వీడి తాడిపత్రిలోని ఎమ్మెల్యే స్వగృహంలోఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. చందన గ్రామానికి చెందిన సంజీవ, బొలికొండ, పూలరంగడు, సూరప్ప, నాగరంగడు, నాగేష్, రంగనాథ, కంబగిరి, పెద్దకంబగిరి, ప్రసాద్, రాము, నల్లప్ప, పవన్, రాయలచెరువు గ్రామానికి చెందిన ఆటో చంద్ర, వెంకటరాముడు, లక్ష్మన్న, అనిల్, రాజమ్మ, ఈశ్వరమ్మ, రంగమ్మతో పాటు మరో 14 కుటుంబాలు పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరుతున్నామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 50 శాతం నామినేటెడ్ పదవుల్లో బీసీ, ఎస్సీ, మైనార్టీలకు కేటాయించారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, భోగాతి బ్రహ్మానందరెడ్డి చందన, రాయలచెరువు నాయకులు రాగుల వెంకటరామిరెడ్డి, శివకేశవ రెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, నాగేష్, జిలాన్ భాష పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

తాడిపత్రిటౌన్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పలు అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. ఉదయం 9 గంటలకు అనంతపురం రోడ్డు నుంచి ఆటోనగర్ మీదుగా కడవ రోడ్డు వరకూ నిర్మించిన బైపాస్‌రోడ్డు ఎమ్మెల్యే ప్రారంభిస్తారు. 10.30కు సజ్జలదిన్నె గ్రామంలోని వైఎస్సార్ గ్రామీణ పార్క్‌లో జరిగిన అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు. 11 గంటలకు ఆలూరు గ్రామంలోని జగనన్న కాలనీలో ఇళ్లు ప్రారంభిస్తారు. 11.30కి బ్రాహ్మణపల్లి జగనన్న కాలనీలో ఇళ్లు ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అయ్యవారిపల్లిలో నూతనంగా నిర్మించిన హెల్త్‌సెంటర్ ప్రారంభిస్తారు. 12.30కి భోగసముద్రం నందు జగనన్న కాలనీలో ఇళ్లు ప్రారంభించనున్నారు. కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు హాజరు కావాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



వృద్ధురాలితో మాట్లాడుతున్న సమన్వయకర్త వీరాంజనేయులు

బుక్కరాయసముద్రం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని శింగనమల సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. ఆదివారం మండలంలోని చెన్నంపల్లి, కొర్రపాడు, పసులూరు. ఏడావులపర్తి, దండువారిపల్లి, అమ్మవారిపేట, రోటరీపురం, రెడ్డిపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. బడుగు, బలహీన వర్గాలకు సీఎం వైఎస్ జగనన్న రాజకీయంగా, సామాజికంగా ఎంతో లబ్ధి చేకూర్చారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. సీఎం వైఎస్ జగనన్న సంక్షేమ పథకాలు, ఆయన చేపట్టిన అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగనన్నను చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్, ఎస్సీ, ఎస్టీ సెల్ కన్వీనర్లు వరికూట కాటమయ్య, సాకే లక్ష్మీనారాయణ, చెదుల్ల సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, నాయకులు రంగనాథ్, శ్రీనివాసులు, బాబు నాయక్, సుబ్బ రాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

తాడిపత్రి అర్బన్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం జి.ఎల్.శంకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ప్రయాణికులు 9959225856 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపడంతోపాటు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

గృహ ప్రవేశానికి హాజరు

బుక్కరాయసముద్రం: మండలంలోని గోవిందపల్లి పంచాయతీ సర్పంచ్ రాములమ్మ, ఆమె కుమారుడు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ అంకే నరేష్ గృహ ప్రవేశానికి ఆదివారం ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, అనంతపురం ఎంపీ రంగయ్య, ఏపీ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ అంకే ముసలన్న, జెడ్పీటీసీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దివ్య బాలయేసు పండుగ



బాలయేసు ఆలయం వద్ద దివ్యబలి పూజను నిర్వహిస్తున్న గురువులు

తాడిపత్రి: మండలంలోని చుక్కలూరు గ్రామంలో ఆదివారం సాయంత్రం క్రైస్తవులు బాల యేసు పండుగను ఘనంగా చేసుకున్నారు. గ్రామంలో ఉన్న బాలయేసు చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలకు ముఖ్య అతిథిగా తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన గురుశ్రీ శాంతమూర్తి హాజరై దివ్య బలి పూజ నిర్వహించారు. తాడిపత్రి క్రీస్తు రాజు చర్చి గురువు డేవిడ్ అరులప్ప, సహాయక గురువులు దివ్యబలి పూజలో పాల్గొన్నారు. తాడిపత్రి నుంచే కాకుండా పలు ప్రాంతాల నుంచి క్రైస్తవులు పెద్ద సంఖ్యలో చుక్కలూరు గ్రామంలో జరిగిన బాలయేసు పండుగకు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఫాదర్లు క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన పండుగ విందులో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకు ముందు బాలయేసు ప్రతిమను పుర వీధుల్లో ఊరేగించారు.

పోలీసుల నాకాబందీ

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో ఆదివారం సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు గుత్తిలోని బండగేరి, ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డులో తనిఖీ చేశారు. అనుమానితులు, పాత నేరస్తుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు నాగమాణిక్యం, ఆజాద్, పోలీసులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం



గుంతకల్లులో వాసవీమాత మూలవిరాట్, పామిడిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

గుంతకల్లు/గుత్తి/పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం ఆర్యవైశ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామునే అమ్మవారి మూలవిరాట్‌తోపాటు బంగారు విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి స్వర్ణకవచం తయారు చేసిన చీర, విశేష పుష్పాలతో అందంగా అలంకరించారు. వేద పండితులు, అర్చకులు నేతృత్వంలో 102 మంది దంపతులచే విశేష వాసవీ మాత హోమం నిర్వహించారు. వందలాది మంది భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే గుత్తి పట్టణంలోని వాసవీ మాత ఆలయంలో ఆదివారం ఆత్మార్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, కోశాధికారి శ్రీకాంత్ గుప్తా, వాసవీ మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు. పామిడి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి మాతృమండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం, బాల రామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు చేపట్టారు. 21 రోజుల హనుమాన్ చాలీసా పారాయణం, తారక్ రామ మంత్ర జప ముగింపు కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆర్యవైశ్యులు, భక్తులు పాల్గొన్నారు.



గుత్తిలో వాసవీమాతను అలంకరించిన దృశ్యం

మధుర గాయకుడు ఘంటసాల



గుంతకల్లులో ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గాయనీ,గాయకులు



తాడిపత్రిలో ఘంటసాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

గుంతకల్లుటౌన్: తరాలెన్ని మారినా తెలుగు పాటకు మా'స్టారు' ఘంటసాల వెంకటేశ్వరరావు అని పద్మశ్రీ ఘంటసాల కల్చరల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఆదివారం సొసైటీ కార్యాలయంలో ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఘంటసాల మధుర గాయకులని కొనియాడారు. అనంతరం పలువురు గాయకులు ఘంటసాల పాటలను పాడి స్వరనీరాజనం అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, సభ్యులు భీమలింగయ్య, మల్లికార్జున, కుళ్లాయప్ప, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం అభిమానులు పట్టణంలోని స్నేహ భారతి సంగీత శిక్షణాలయంలో నిర్వాహకుడు మహేష్ స్వామి ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక మార్కండయస్వామి ఆలయంలో పాడుతా తీయగా.. చల్లగా పేరుతో సంగీత విభావరి ఏర్పాటు చేశారు. ఈ విభావరిలో ఘంటసాల గీతాలను గాయకులు ఆలపించి శ్రోతలను రంజింప చేశారు. ఘంటసాల అభిమానులు రామకృష్ణ, బాలు, గోకుల్ మాధవ, దర్భ మహేశ్వరశర్మ, నాయుడు, నాగరంగయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇళ్ల పట్టాల పంపిణీ

యాడికి: మండలంలోని మోడల్ స్కూల్ వద్ద ఉన్న జగనన్న లే అవుట్‌లో సోమవారం సాయంత్రం 3 గంటలకు రాయలచెరువు పంచాయతీలో అర్హులైన 118 మంది నిరుపేదలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తారని జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాయలచెరువు, కుర్మాజిపేట, రామరాజుపల్లె గ్రామానికి చెందిన లబ్ధిదారులు మోడల్ స్కూల్ వద్దకు తరలిరావాలన్నారు.

16న మహంకాళి విగ్రహ ప్రతిష్ట

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరులో ఈ నెల 16న మహంకాళీ దేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఈ నెల 15న ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, కళశ స్థాపన, 16న ఉదయం 10.30కి మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తామన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నేరాలు మాని సత్ప్రవర్తనతో మెలగండి



షికారీలకు సూచనలిస్తున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

గుంతకల్లుటౌన్: నేరప్రవృత్తిని మానుకుని సత్ప్రవర్తనతో మెలగాలని, లేకుంటే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి షికారీకాలనీవాసులను హెచ్చరించారు. ఆదివారం తెల్లవారుజామున షికారీకాలనీలో డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు చేశారు. రికార్డుల్లేని 8 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతకం డీఎస్పీ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడి చోరీచేసిన సొత్తుతో ఇక్కడ ఆశ్రయం పొందాలని చూసినా, దొంగలకు బంధువులెవరైనా ఆశ్రయమిచ్చినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అపరిచిత వ్యక్తులెవరు వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారమందించాలన్నారు. కర్ణాటక మద్యం, నాటు సారా, గంజాయి విక్రయాలను మానుకోవాలన్నారు. పిల్లల్ని ప్రభుత్వ బడుల్లో చేర్పించి, ప్రయోజకులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రామసుబ్బయ్య, గణేష్, మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ అడుగుజాడల్లో నడవాలి



దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాడిపత్రి అర్బన్: పండిట్ దీన్‌దయాళ్ అడుగుజాడలు యువ తరానికి అనుసరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. దీన్‌దయాళ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని మహాత్మా గాంధీ సర్కిల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకుడు అంకాల్‌రెడ్డి మాట్లాడుతూ దీన్‌దయాళ్ స్వశక్తి భారత్ కోసం అలుపెరుగని కృషి చేసిన యోధుడన్నారు. దీన్‌దయాళ్ ఆశయాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి, ఓబీసీ మోర్చా రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి రామాంజనేయులు, చేనేత సెల్ జిల్లా కన్వీనర్ నారాయణస్వామి, లీగల్ సెల్ మాజీ నాయకులు ఆదిశేషారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గార్లదిన్నె: మండలంలోని కొప్పలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్లో 2013–14లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందించారు. అనంతరం అప్పటి హెచ్ఎం చంద్రశేఖర్‌నాయుడు, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లాయర్ శ్రీనాథ్ చౌదరి, డాక్టర్ గోవర్దన్ నాయుడు, ఇంజినీర్ గణేష్, రాజశేఖర్, సురేష్, దవ్యసాయి, సుప్రజ, చంద్రశేఖర్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉర్దూ కళాశాల ప్రారంభం

గుంతకల్లు: ఉర్దూ జూనియర్ కళాశాల త్వరలో ప్రారంభమవుతుందని అరబిక్ హైస్కూల్ అడ్వైజర్ చైర్మన్ డాక్టర్ అబ్దుల్‌గని, ఆడిటర్ ఇంతియాజ్, అధ్యక్ష, కార్యదర్శులు సీఎం పెంయిట్స్ దాదా, ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల ఉర్దూ జూనియర్ కళాశాలపై కొందరు లేనిపోని అపోహలు సృష్టిస్తూ పక్కదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సంబంధం లేని విషయాల్లో తలదూరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉర్దూ జూనియర్ కళాశాల బిల్డింగ్ నిర్మాణాలు కూడా పూర్తయిన విషయం గుర్తు చేశారు. ఇటీవల ఎమ్మెల్యే వైవీఆర్ బిల్డింగ్‌లను పరిశీలించి ఒక నివేదకను తయారు చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. కొన్ని పత్రికల్లో, మీడియాలో వచ్చిన విధంగా ఏమీ జరగదని, ఉర్దూ జూనియర్ కళాశాల త్వరలో ప్రారంభిస్తామన్నారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని తహసీల్దారు జయప్రసాద్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. మండలంలోని ప్రజలు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదులు అందజేయాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ తీసుకురావాలన్నారు.